అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

- మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే
- నగరంలో మురుగుడు లావణ్య విస్తృత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న మురుగుడు లావణ్య, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, మాజీ ఎమ్మెల్యే కమల

మంగళగిరి: మంగళగిరి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి జరిగిందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలుగా చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, వారే ముందుకు వచ్చి ఘన స్వాగతం పలుకుతూ పార్టీ విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేస్తుండడం ఆనందంగా ఉందని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతుంది. సోమవారం పట్టణంలోని 14,15 వ వార్డుల్లో ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. ప్రచారంలో లావణ్యతో పాటు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రజలను తమకు అండగా నిలవాలని కోరారు. నాయకులు ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తుండడంతో కార్యకర్తలు మరింత ఉత్సాహంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్, టీడీపీ నాయకుడు కాండ్రు శ్రీనివాసరావు ఆశ్వీరాదం తీసుకుని తమకు అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న స్పందన లావణ్య తప్పకుండా విజయం సాధిస్తుందన్నారు. నగరంలో గత ఐదు సంవత్సారాలలో ప్రతి సామాజిక వర్గం అభివృద్ధి చర్యలు తీసుకున్నామని ఆయా సామాజికవర్గాలన్ని వైఎస్సార్ సీపీకి అండగా ఉంటున్నాయన్నారు. గత ఐదు సంవత్సారాలలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధితో ప్రజలను ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. గత పాలనలో నియోజకవర్గానికి ఏమి చేశారని ప్రజలను టీడీపీ నాయకులు ఓటు అడుగుతారని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, చేనేత భవన నిర్మాణం, రోడ్ల విస్తరణ, సామాజికవర్గ భవనాల నిర్మాణం, వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల ఏర్పాటు, తాగునీటి సమస్య పరిష్కారం ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేయడం జరిగిందని, టీడీపీ పాలనలో నియోజకవర్గంలో చేసిన ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజలకు చూపించగలరా అని నిలదీశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు స్థానికంగా వున్న మహిళ లావణ్యను ప్రజలు ఆశ్వీరదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఎన్నికలలో లావణ్య అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ సుంకర రఘుపతిరావు, మాజీ కౌన్సిలర్ కలకోటి స్వరూపారాణి,నాయకులు నాలి వెంకటకృష్ణ, మల్లవరపు సుధారాణి, గుంటి రాజ్యలక్ష్మి, మురుగుడు సత్యం, ఆత్మకూరు మాజీ సర్పంచ్ బొమ్ము శివరామిరెడ్డి, గూండా మధు, కాండ్రు శివనాగేంద్రరావు, మునగాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జనం మెచ్చిన నాయకుడు జగనన్న

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- ఫిరంగిపురం పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం

ఫిరంగిపురం: ప్రజలు మెచ్చిన నాయకుడు ముఖ్యమంత్రి జగనన్న అని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అభ్యర్థి మేకతోటి సుచరిత అన్నారు, మండల కేంద్రంలోని 11,12,13,14,15 వార్డులలో ఇంటింటికి తిరిగి ఆత్మీయంగా పలకరించారు. పలువురు మహిళలు సుచరితను సాదరంగా స్వాగతించారు. ప్రతి ఇంటివద్దకు వెళ్లి ప్రభుత్వం నుంచి వారికి అందిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ ఫలాలు అందేలా కృషిచేశారన్నారు. దేశంలో ఇంతమంచి పద్ధతి ఎక్కడా లేదని చెప్పారు. దళారులతో పనిలేకుండా నేరుగా ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు అందేలా చేసిన మొట్టమొదటి నాయకుడు సీఎం వైఎస్ జగన్ అన్నారు. రాష్ట్రంలో చేపట్టిన పలు పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలు జగన్‌కు బ్రహ్మరథం పట్టి ప్రేమపూర్వకంగా ఆదరిస్తున్నారని చెప్పారు. ఇదిచూడలేని ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతున్న మాటలు వినే పరిస్థితిలో ప్రజలు లేరని తెలిపారు. ఇప్పటివరకు సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా ముఖ్యమంత్రి పనిచేశారని గుర్తుచేశారు, ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమానికి ముందుగా రసూల్‌పేట వద్ద గల రామాలయం వద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. అనంతరం పోస్టు ఆఫీసువద్ద గల వేళాంగిణి మాత మందిరం వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు..

12, 13 వార్డులో 36మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లో చేరారు. వారికి ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీకోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, వారికి పార్టీ ఎప్పుడు అండగా నిలుస్తుందని చెప్పారు. ఆమెవెంట జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు నన్నం సునీత, చిట్టా అంజిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పి.జోస్‌ఫినా, టి.విజయలక్ష్మీ, బి.శ్రీనివాసరెడ్డి, రామమోహన్ రెడ్డి, పాలపాటి రఘు, డి, నరేంద్రకుమార్, ఎం.సురేష్, అయ్యప్పరెడ్డి, బి.అంజిరెడ్డి, డి.మెల్కియా, మేడాబాబు, హేమలతారెడ్డి, సతీష్, రామారావు, పి.చిన్నా, పి.జోసఫ్, ఎస్.నాగరాజు, జి.చంద్రం, సాంబయ్య, ఫ్రాన్సిస్‌లు పాల్గొన్నారు.



ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సుచరిత

క్లుప్తంగా

స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

స్వర్ణకార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్

మంగళగిరి: స్వర్ణకారులకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని స్వర్ణకార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం స్వర్ణకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వేణుమాధవ్ మాట్లాడుతూ స్వర్ణకారులందరు ఏకతాటిపైకి వచ్చి స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుకు ఉద్యమం చేయడం జరుగుతుందన్నారు. స్వర్ణకారులకు ఇబ్బందిగా మారిన జీఓ 272ను సవరించాలన్నారు. స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేసే పార్టీకే స్వర్ణకారుల మద్దతు ఉంటుందన్నారు. సంఘం నాయకులు జగ్గారపు రాము, మండ్రు రాము, గుంటి నాగరాజు, గాజుల శ్రీనివాసరావు, కందుల నాగార్జున, అడిగొప్పల శ్రీనివాసరావు, బల్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని గాలిబాలి శాఖ గ్రంథాలయాన్ని సోమవారం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సుబ్బరత్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలని చెప్పారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని పుస్తకాలు ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలన్నారు. వచ్చేది వేసవి కాలం కావడంతో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూసి గ్రంథాలయానికి వచ్చేవారి సంఖ్య పెరిగేలా చూడాలని చెప్పారు. తగిన సూచనలు అందజేశారు. ఆమె వెంట గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్ ఉన్నారు.

నేడు పునీత ఆంథోని ఆలయ వార్షికోత్సవం



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని రాజాపేటలో పునీత ఆంథోనివారి ఆలయ పదకొండో వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు మున్నంగి జోజప్ప సోమవారం తెలిపారు. ఉదయాన్నే పునీత ఆంథోని వారికి దివ్యపూజాబలి, ప్రత్యేక పూజలు, కీర్తనలు బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పామిశెట్టి బాలస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ఆటోనుంచి జారిపడి తీవ్రగాయాలు కావడంతో వైద్యశాలలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని వేములూరిపాడులో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములూరిపాడుకు చెందిన పి.అనసూర్యమ్మ(58) గ్రామశివారులో ఓ పరిశ్రమలో రోజువారీ కూలీగా పనిచేస్తుంది. ఈక్రమంలో ఆదివారం పనికి ఆటోలో వెలుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సకోసం గుంటూరు సర్వజనాసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్సపొందుతూ ఆమె మృతిచెందింది. బంధువుల ఫిర్యాదుతో సోమవారం కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలి



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు సేవలు అందించాల్సిన బాధ్యత అందరి వైద్యులపై ఉందని డాక్టర్ పాదిల ప్రసాద్ అన్నారు. సోమవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌తో కలిసి అడ్వాన్స్‌డ్ ఐసీయూతో పాటు పలు వార్డులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిరణ్ కుమార్ వచ్చిన తర్వాత ఆసుపత్రి రూపు రేఖలు మారాయన్నారు. బాధ్యతగా పని చేస్తూ రోగులకు సేవలు అందించే విషయంలో అందరిని కలుపుకుంటూ ఆసుపత్రిని అభివృద్ధి పథంలోకి తీసుకుని వెళ్తున్నారని అభినందించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పాదిల ప్రసాద్ బ్లాక్‌లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర సేవలు అందిస్తున్నామని చెప్పారు. పేద ప్రజలకు పాదిలి ప్రసాద్ అండగా నిలుస్తున్నారని చెప్పారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్

తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్



బండారుపల్లిలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్

బండారుపల్లి(తాడికొండ): ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక పోలీసు పికెట్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలో సోమవారం కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించిన ఆయన మాట్లాడుతూ ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు. వివాదాలు, గ్రూపు గొడవలు, పార్టీలకు సంబంధించి వర్గ పోరులకు దిగితే సహించేది లేదన్నారు. ఫ్యాక్షన్ పడగ ఉన్న గ్రామాల్లో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి వివాదాలపై ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందించాలన్నారు. పలువురు పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

చిన్నారులకు దివ్య సంస్కారాలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి పరిశుద్ధ దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించారు. దివ్యపూజాబలిలో గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య పాల్గొని పరిశుద్ధ దివ్యపూజ నిర్వహించారు. చిన్నారులకు దివ్య సంస్కారాలైన భద్రమైన అభ్యంగనం, దివ్యసత్ ప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ భగవంతుని నామాన్ని నిత్యం స్మరించుకోవడాన్ని చిన్నారులు అలవాటు చేసుకోవాలని చెప్పారు. దానిద్వారా క్రీస్తు ఆశీస్సులు వారిపై పరిపూర్ణంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో దేవాలయ విచారణ గురువులు పామిశెట్టి బాలస్వామి, సహాయ విచారణ గురువు రాజవరపు అనిల్, గుడిపెద్దలు, మఠ కన్యాస్త్రీలు, కథోలిక్కులు పాల్గొన్నారు.

నిబంధనల అమలులో అధికారులు తలమునకలు



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ అనురాధ

తాడికొండ: ఎన్నికల నిబంధనల అమలులో అధికారులు తలమునకలయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కోడ్ అమల్లోకి వచ్చిన 48 గంటల్లో పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, జెండాలు, రంగులు ఇతర పోస్టర్లు తొలగించాలనే ఆదేశాల మేరకు గత రెండు రోజులుగా అధికారులు ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లో తొలగించే పనిలో పడ్డారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సొంత భవనాలపై సైతం పార్టీ జెండాలు, బ్యానర్లు ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు తప్పనిసరిగా అధికారుల అనుమతులు పొందాలని అందుకు సంబంధిత అధికారులను సంప్రదించాలని అధికారులు తెలిపారు. ఈఓఆర్డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాకీ అడిగిందని మద్యం సీసాతో దాడి

నగరంపాలెం: బాకీ అడిగినందుకు మహిళపై మద్యం సీసాతో దాడికి పాల్పడిన ఘటనపై అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. శారద కాలనీ 16వ వీధికి చెందిన పి.మరియమ్మ సుమారు ఆరు నెలలు క్రితం అదే ప్రాంతానికి చెందిన ఎం.మణికి రూ.10 వేలు అప్పు ఇచ్చింది. డబ్బులు తిరిగి అడిగితే ఇవ్వలేదు. ఈ క్రమంలో సోమవారం మరోసారి మణిని డబ్బులు విషయమై.. మరియమ్మ ప్రశ్నించగా.. అతను ఆమెపై మద్యం సీసాతో దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

ద్విచక్ర వాహనం అపహరణపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. కళాకారుల కాలనీ 2వ వీధికి చెందిన కృపానంద్ ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని నాలుగు రోజుల క్రితం దొంగలించారు. దీనిపై బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డెరలకు ఎమ్మెల్యే సీటు కేటాయించాలి

వడ్డెర సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో వడ్డెరలకు సముచిత స్థానం కల్పించాలని, చట్టసభల్లో అవకాశం కల్పించాలని వడ్డెర సాధికారిత రాష్ట్ర సభ్యుడు వడ్డే వెంకట్ అన్నారు. సోమవారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో వడ్డెర సాధికారత కమిటీ మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షుడు వేముల శివ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడనుంచైనా వడ్డెరలకు ఒక్క ఎమ్మెల్యే సీటు కేటాయించాలని కోరుతున్నామన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో వడ్డెర్ల ఓట్లు 10 వేల వరకు ఉన్నాయని అన్నారు. రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు తిరుపాల్ బాబు, స్టేట్ మెంబర్ గుంజి అంకమ్మరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు వడ్డెరలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి అన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు వేముల శివ మాట్లాడుతూ త్వరలో మంగళగిరి నియోజకవర్గంలో వడ్డెర మహాసభ నిర్వహించనున్నామని అన్నారు. ఈ సమావేశంలో మంగళగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గొడ్డెలగల జయలక్ష్మి, గొడ్డెలగల శ్రీనివాసరావు, వేముల దుర్గారావు, ఉప్పుతల వాసు, ఉప్పు రామకృష్ణ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సామాన్యులకు సత్వర న్యాయం



మాట్లాడుతున్న న్యాయవాది ప్రసాదరావు

లక్ష్మీపురం: కోర్టులపై పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడంతోపాటు, సామాన్యులకు సత్వర న్యాయం అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని న్యాయవాది ముప్పాళ్ల వీఎస్.ప్రసాదరావు అన్నారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో న్యాయవాది ముప్పాళ్ల వి.ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను ఎలాంటి ఖర్చు లేకుండా ఇరువర్గాల పరస్పర అంగీకారంతో లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులను కొలిక్కి తేవడంలో లోక్ అదాలత్ ప్రత్యేకత అన్నారు. ఈ ఏడాది కోటికి పైగా కేసులు పరిష్కారమైనట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయన్నారు. ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ ఏదైనా సమస్యతో న్యాయస్థానాలకు వెళితే అది పరిష్కారమయ్యేనాటికి ఏళ్లు గడుస్తాయన్నారు. కక్షిదారులు మానసికంగా, ఆర్థికంగా చితికపోతున్నారన్నారు. కోర్టులంటే భయపడి చాలా మంది వాటి గడప తొక్కటానికి భయపడుతున్నారన్నారు. ఈ సమస్యలకు లోక్అదాలత్‌లు పరిష్కారంగా నిలుస్తున్నాయన్నారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడుతూ వనరుల కొరత, నైపుణ్యం కలిగిన సిబ్బంది లేమి, ప్రజల్లో అవగాహన కొరవడటం వల్ల లోక్ అదాలత్‌లు ఆశించిన స్థాయిలో ప్రజలకు చేరువ కాలేకపోతున్నాయన్నారు. సమావేశంలో ఎస్.సదాశివరావు, ఆర్.వి.సింగరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వేశ్వరస్వామి కల్యాణం

పాత గుంటూరు: బ్రాడీపేటలోని గౌరి విశ్వేశ్వరాలయంలో స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా సోమవారం స్వామివారికి వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి, ఆలయ అర్చకులు విశ్వేశ్వరశర్మ, జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్ కుమార్ శర్మ, మల్లికార్జునశర్మ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రంగావఝ్జుల సత్యనారాయణ, శశికళ, పాశం మధు, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

క్రైస్తవ సమాధుల వద్ద జంగిల్ క్లియరెన్స్

ఎంటీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని క్రైస్తవ సమాధుల వద్ద జంగిల్ క్లియరెన్స్ చేయాలని వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్ ఆధ్వర్యంలో సోమవారం ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముదిగొండ ప్రకాష్ మాట్లాడుతూ క్రైస్తవులు అతి పవిత్రంగా నిర్వహించే సమాధుల పండుగకు వీలుగా ఎంటీఎంసీ అధికారులు క్రైస్తవుల సమాధుల వద్ద జంగిల్ క్లియరెన్స్ చేయాలన్నారు. ఈనెల 28వ తేదీనాటికి పనులు పూర్తిచేయాలని వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఎస్టీ సెల్ తాడేపల్లి అధ్యక్షుడు బాలసాని అనిల్, గొర్రుముచ్చు సుదర్శనం, కొరగంజి ఉదయరాజు, ఎం.విజయకుమార్, బేతం భాస్కర్, రొడ్డ ఎలీషా, ఈటె హనోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ సమర్థంగా అమలు చేస్తాం..

తాడేపల్లిరూరల్: ఎన్నికల కోడ్‌ను నగరంలో సమర్థంగా అమలు చేస్తామని, కోడ్ ఉల్లంఘించే కార్యక్రమాలను ప్రభుత్వ శాఖ అధికారులు నిర్వహించరని మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్ కుమార్ అన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త పనులు నిర్వహించడం కానీ, శంకుస్థాపనలు చేయడం కానీ జరగదన్నారు. ఎంటీఎంసీ పరిధిలో ప్రజలకు అవసరమైన తాగునీటి సరఫరా, ఇతర సమస్యలను కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. ప్రజలు తమ సమస్యలను వెంటనే తెలియజేయాలని, కొంతమంది ఎన్నికల కోడ్ ఉంది కదా, కార్పొరేషన్ కార్యాలయంలో ఎటువంటి ప్రజా సమస్యలు పట్టించుకోరని ప్రచారం చేస్తున్నారని, అలాంటిది ఏమీ ఉండదని, ఎన్నికల కోడ్‌లోకి రాని అంశాలను పరిగణనలోకి తీసుకుని కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తారని ఆయన తెలిపారు.

టీడీఎస్‌పై అవగాహన అవసరం



కొరిటిపాడు: బ్యాంకింగ్ రంగంలో ఉన్న ప్రతి ఒక్కరూ టీడీఎస్‌పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆదాయపుపన్ను శాఖ అధికారి జగదీష్ కోరారు. విజయవాడలోని టీడీఎస్ కమిషనర్ ఆదేశాల మేరకు గుంటూరు ఆదాయ పన్ను శాఖ టీడీఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జీడీసీసీ బ్యాంకులో టీడీఎస్‌పై అవగాహనా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జగదీష్ మాట్లాడుతూ, బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది సంపూర్ణ అవగాహనతో సక్రమంగా టీడీఎస్ అమలయ్యేలా చూడాలని సూచించారు. ఆదాయపన్ను శాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ టీడీఎస్ చెల్లించే అంశంలో పాటించాల్సిన నియమ నిబంధనలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జీతాలపై ప్రతి నెలా దామాషా పద్ధతిలో టీడీఎస్ చేయాలనీ.. డిపాజిట్లపై వచ్చే వడ్డీతో పాటు, బ్యాంకు భవనాలకు చెల్లించే అద్దె రూ. 2.40 లక్షలు దాటితే విధిగా 10 శాతం టీడీఎస్ ఉంటుందన్నారు. బ్యాంకు సిబ్బంది సందేహాలకు నివృత్తి చేస్తూ పలు సెక్షన్ల కింద బ్యాంకు వసూలు చేయాల్సిన టీడీఎస్ గురించి సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో జిల్లాలోని కోఆపరేటివ్ బ్యాంకుకు సంబంధించిన అన్ని బ్రాంచీల మేనేజర్లు, ఆదాయ పన్ను అధికారి రాజశేఖర్, జీడీసీసీ బ్యాంకు సీఈఓ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT & SESSIONS JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
O.S.NO. 30 OF 2024

Between:-
Sri. Ajjarapu Sambasiva Rao
And six others ...Plaintiffs
AND
The Tahsildar, Saroornagar Mandal
and two others ...Defendants
To
All concerned ...Defendant No.3

The general public are hereby informed that the plaintiffs in the above suit namely Ajjarapu Sambasiva Rao, Smt.Aruna Kumari Ajjarapu. Aditya Gautam Ajjarapu, Avinash Ajjarapu, Smt. Ajjarapu Kameswari, Azzarapu Surya Vamsi and Ajjarapu Vanamali Santosh as the legal heirs of the deceased Late.A.Annapurna, W/o.Late. Ajjarapu Suryanarayana have filed the above suit for declaration to declare them as legal heirs to the deceased Late. A.Annapurna who died intestate on 19.08.2016 in respect of the property of Plot No.88, admeasuring 200 Sq.yards in Sy.Nos.12/5B and 12/5C at Chinakakani Village, Mangalagiri Mandal, Guntur District. A.P.

If any person is having any claim or interest in the property, they shall appear before the above court on 12.04.2024 at 10.30 am and file their objections. Please note that if no objections are filed, it will be treated that there are no claims, on the property and the court will pass appropriate orders in the matter.

//BY ORDER OF THE COURT//
Sd/- P.VENKATESWARA RAO, P.R.MANOHAR - Advocates
G-3, Sasirekha Apartments, Trimulgherry, Secunderabad. Cell: 9391015458

రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించిన ప్రధాని మోదీ

- బహిర్గతమైన అనైతిక పొత్తు రహస్యం
- జై భారత్ పార్టీ నాయకుల విమర్శ



విలేకరుల సమావేశంలో జై భారత్ పార్టీ నాయకుడు సుశీల్ రాజా

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రయోజాలను విస్మరించిన ప్రధాని మోదీకి ఆకస్మాత్తుగా రాష్ట్రంపై ప్రేమ పుట్టుకొచ్చిందని, అందుకే రాష్ట్రంపై కపట ప్రేమను ఆదివారం జరిగిన సభలో ప్రదర్శించారని జై భారత్ పార్టీ నాయకులు మంచాల సుశీల్ రాజా, షేక్ బాషాలు ఎద్దేవా చేశారు. తెనాలిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ, టీడీపీ, జనసేనలు అనైతిక పొత్తు పెట్టుకుని మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధపడ్డారని విమర్శించారు. ఎన్డీఏ మిత్ర పక్షాలకు రాష్ట్ర ప్రయోజనాల కన్నా పార్టీ ప్రయోజనాలే ముఖ్యమనే విషయం సభలో బహిర్గతమైందని ఆరోపించారు. ఈ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పి.రవికిరణ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ చికిత్సపై అవగాహన



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రత్యామ్నాయ చికిత్స పద్ధతులపై అవగాహన అవసరమని హైదరాబాద్‌కు చెందిన ఆచార్య శశికాంత్ శర్మ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం భారత్ వికాస్ పరిషత్ గుంటూరు శాఖ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్ అధ్యక్షతన ఆరోగ్యంపై అవగాహన, ప్రత్యామ్నాయ చికిత్సా పద్ధతులపై సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న శశికాంత్ శర్మ దక్షిణ కొరియాకు చెందిన పుజకో థెరపీ విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో భాతర్ వికాష్ పరిషత్ కార్యదర్శి అంకిత్ కుమార్ జైన్ సలేచ, ఆర్థిక కార్యదర్శి చిన్నం చలమయ్య, కన్వీనర్ పి.శేఖర్, జాతీయ కార్యవర్గ సభ్యులు మల్లికార్జునరావు, కేవీ బ్రహ్మం, యోగా నిపుణులు పాల్గొన్నారు.